పిల్లర్లతో ఫ్లైఓవర్‌ను నిర్మించాలి

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజినీర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం, జూలై 2 : పనామా చౌరస్తాలో జాతీయ రహదారిపై నిర్మిస్తున్న బ్రిడ్జిని పిల్లర్లతో కూడిన ఫ్లై ఓవర్‌ను నిర్మించాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి సూచించారు. మంగళవారం ఆర్‌అండ్‌బీ శాఖ చీఫ్ ఇంజినీర్ గణేశ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోడలు కట్టి మట్టితో నింపే బ్రిడ్జిని నిర్మిస్తే సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. చూసేందుకు కూడా అంద విహీనంగా కనిపిస్తుందన్నారు. మహా నగరానికి ముఖ ద్వారంగా ఉన్న చోట అందమైన ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టాలని సూచించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయమై గతంలో కూడా అధికారుల దృష్టికి తీసుకువచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. చీఫ్ ఇంజినీర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఎమ్మెల్యేతోపాటు మాజీ కార్పొరేటర్లు జిట్టా రాజశేఖర్‌రెడ్డి, కొప్పుల విఠల్‌రెడ్డి, జీవి సాగర్ రెడ్డి పాల్గొన్నారు.

సెల్ఫ్ ఫైనాన్స్ కాలనీలో కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి..

అన్ని కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ సెల్ఫ్ ఫైనాన్స్ కాలనీలో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవకాశమున్న ప్రతి చోట కమ్యూనిటీ హాళ్లను నిర్మించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్ రెడ్డి, సీనియర్ నాయకులు మాధవరం నర్సింహారావు, అనిల్ చౌదరి, గడ్డం మల్లేశ్‌గౌడ్, సుమన్‌గౌడ్, నీళ్ల రాజశేఖర్‌గౌడ్, పోగుల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఫ్లైఓవర్ రీడిజైన్‌కు ఆదేశాలు జారీ

మన్సూరాబాద్, జూలై 2: సుష్మ, పనామా చౌరస్తాల్లో ఫ్లైఓవర్లను రీడిజైనింగ్ చేయాలని కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ ఆదేశాలు జారీ చేసినట్లు రంగారెడ్డి జిల్లా అర్బన్ బీజేపీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, మన్సూరాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి తెలిపారు. ఎల్బీనగర్, మన్సూరాబాద్, చంద్రపురికాలనీలోని రంగారెడ్డి జిల్లా బీజేపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుష్మ, పనామా చౌరస్తాల్లో మట్టిని పోసి వేస్తున్న ఫ్లైఓవర్ వలన ఇరు పక్కన ఉన్న వ్యాపార సంస్థలకు తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉందని తెలిపారు. మన్సూరాబాద్, హయత్‌నగర్, వనస్థలిపురం డివిజన్ల పరిధిలోని వంద కాలనీలకు దారులు మూసుకుపోయే పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. ఈ విషయాన్ని మల్కాజిగిరి పార్లమెంటు సభ్యుడు ఈటల రాజేందర్ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. ఎంపీ ఈటల రాజేందర్ వెంటనే ఈఎన్‌సీ గణపతిరెడ్డిని ఢిల్లీకి పిలిపించుకుని సమస్య తీవ్రతను కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. కేంద్ర మంత్రి వెంటనే స్పందించి ఫ్లైఓవర్లను రీడిజైనింగ్ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారని పేర్కొన్నారు. ప్రజల అభీష్టం మేరకు సుష్మ, పనామా చౌరస్తాల్లో పిల్లర్లతో కూడిన ఫ్లైఓవర్ల నిర్మాణాలు చేపట్టేందుకు కేంద్ర మంత్రి ముందుకు వచ్చారని తెలిపారు. సమస్యను పరిష్కరించిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, ఎంపీ ఈటల రాజేందర్‌కు ఎల్బీనగర్ ప్రజల పక్షాన కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు నవజీవన్‌రెడ్డి, ప్రేమ్‌మహేశ్వర్ రెడ్డి, నాయకులు నూతి శ్రీనివాస్, నాంపల్లి రామేశ్వర్, గంగదాసు కృష్ణారెడ్డి, కృష్ణంరాజు, లయ, శ్రీదేవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రంగారెడ్డి జిల్లా అర్బన్ బీజేపీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి

మెరుగైన వైద్యం అందించేందుకు కృషి

బాధితులకు ఎల్వోసీ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

కందుకూరు, జూలై 2 : పేదలకు మెరుగైన వైద్యం అందించడానికి కృషి చేస్తానని మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తెలిపారు.మండల పరిధిలోని కొత్తగూడ గ్రామానికి చెందిన జెబాబేగం అనారోగ్యానికి గురై వైద్యం చేయించుకోవడానికి ఆర్థిక స్థోమత లేకపోవడం వల్ల సబితా ఇంద్రారెడ్డిని ఆశ్రయించడంతో విషయం తెలుసుకున్న ఆమె వెంటనే స్పందించి వైద్య పరీక్షల కోసం రూ. లక్షా 50వేల ఎల్వోసీని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదలను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. పేదలకు వైద్య పరీక్షల నిమిత్తం సీఎం సహాయ నిధి ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. మాజీ సర్పంచ్‌లు రామ క్రిష్ణారెడ్డి, రాయిచెట్టు యాదయ్య, ఎంపీటీసీ సురేశ్, బీఆర్ఎస్ నాయకులు ఎండీ అంజద్, చోటేజానీ,జహంగీర్ పాల్గొన్నారు.

ఆస్మాన్‌ఘడ్‌లో సమస్యలు పరిష్కరించాలి

ఆస్మాన్‌ఘడ్‌లో సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అహ్మద్ బలాల

సైదాబాద్, జూలై 2 : ఆస్మాన్‌ఘడ్‌లో సమస్యలను పరిష్కరించాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల సూచించారు. మంగళవారం సైదాబాద్ డివిజన్ పరిధిలోని ఆస్మాన్‌ఘడ్‌లోని పలు ప్రాంతాల్లో జీహెచ్ఎంసీ, విద్యుత్, శానిటేషన్, జలమండలి అధికారులతో కలిసి పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రజలకు మురుగు, తాగునీటిలో లోపాలు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పలు ప్రాంతాల్లో విద్యుత్ సమస్యలను అరికట్టడానికి అవసరమైన మరమ్మతులను చేపట్టాలని సూచించారు. స్థానికంగా మురుగునీటి, తాగు నీటి వ్యవస్థల ఆధునీకరణ కోసం తవ్విన రోడ్ల ప్యాచ్ వర్క్ పనులను, రోడ్లు, ఫుట్‌పాత్‌లను అభివృద్ధి చేయటానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జీహెచ్ఎంసీ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ వెంకన్న, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్, జలమండలి డీజీఎం షీలారాణి, విద్యుత్ ఏఈ వేణుగోపాల్‌రెడ్డి, ఎంఐఎం పార్టీ నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయ స్వామి వార్షికోత్సవం

మన్సూరాబాద్, జూలై 2: మన్సూరాబాద్ డివిజన్ పరిధి ఆదిత్యనగర్‌కాలనీలోని శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి 9వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ట్రస్టు చైర్‌పర్సన్ సంతోషికుమారి, చైర్మన్ మోహన్‌రెడ్డి, వైస్‌చైర్మన్ రవికుమార్, ఆలయ కమిటీ సభ్యులు వీఎస్ఎన్ మూర్తి, జీకే గుప్త, ఎన్‌వీఆర్ నాగరాజు, అర్చకులు కొండలాచార్యులు పాల్గొన్నారు.

రీవాల్యూయేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 2: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని లా కోర్సుల పరీక్షా ఫలితాల రీవాల్యూయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. మూడేళ్ల ఎల్ఎల్‌బీ, మూడేళ్ల ఎల్ఎల్‌బీ ఆనర్స్, ఐదేళ్ల బీఏ ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీబీఏ ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీకామ్ ఎల్ఎల్‌బీ తదితర కోర్సుల మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. విద్యార్థులు తమ మార్కు మెమోలను రెండు వారాల తరువాత నుంచి సంబంధిత కళాశాలల్లో తీసుకోవాలని సూచించారు. ఈ ఫలితాలపై రీవా ల్యూయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.700 చొప్పున చెల్లించి, ఈ నెల 18లోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. జవాబు పత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి ఈ నెల 31లోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి

కందుకూరు, జూలై 2 : మండల పరిధిలోని బాచుపల్లి గ్రామానికి చెందిన రైతు పగడాల యాద య్య, వర్షాలు కురియడంతో విత్తనాలు వేయడానికి ఎద్దులను తీసుకొని కూలీకి వెళ్లారు. ఈ సమయంలో విత్తనాలు వేస్తుండగా పొలంలో ఉన్న సపోర్టు తీగకు తాకడంతో విద్యుత్ షాక్‌కు గురై ఎద్దు మృతి చెందింది.

ఆలయాల అభివృద్ధికి నిధులు కేటాయించాలి

సైదాబాద్, జూలై 2 : రాబోయే ఆషాఢ మాస బోనాల ఉత్సవాల నేపథ్యంలో సైదాబాద్ డివిజన్ పరిధిలోని ఆలయాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరుతూ సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్ రెడ్డి మంగళవారం సౌత్‌జోన్ జోనల్ కమిషనర్ వెంకన్నకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉన్న ఆలయాల వద్ద టైల్స్ ఏర్పాటు, పెయింటింగ్, ప్యాచ్ వర్క్ మరమ్మతుల పనులకు అవసరమైన నిధులను కేటాయించాలన్నారు. బోనాల పండుగ నిధులను త్వరగా మంజూరు చేయటం ద్వారా ఆలయాల వద్ద పనులను సకాలంలో పూర్తిచేయటానికి దోహదపడుతుందని ఆమె పేర్కొన్నారు.

జోనల్ కమిషనర్ వెంకన్నకు వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ అరుణ

ట్రాఫిక్ నియమాలపై అవగాహన

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగం చంద్రశేఖర్

మలక్‌పేట, జూలై 2: ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘిస్తూ దేశంలో ప్రతియేట లక్షలాదిమంది రోడ్డు ప్రమాదాల్లో మృతిచెందుతూ తల్లిదండ్రులకు గర్భశోకాన్ని మిగుల్చుతున్నారని మలక్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగం చంద్రశేఖర్ అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆయన దిల్‌సుఖ్‌నగర్‌లోని ఐడియల్ జూనియర్ కళాశాలలో ట్రాఫిక్ నియమాలు, రోడ్డు భద్రత, మోటార్ వెహికిల్ యాక్ట్ 1988, 2019లపై విద్యార్థులకు అవగాహనను కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సురక్షిత ప్రయాణాలకోసం ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నియమాలను విధిగా పాటించాలన్నారు. హెల్మెట్ ధరించకుండా, సీట్ బెల్ట్ పెట్టుకోకుండా వాహనాలను నడపటం, సిగ్నల్ జంపింగ్, రాంగ్ రూట్‌లో వెళ్లటం, లైసెన్స్ లేకుండా వాహనాలు వాహనాలు నడపటం, మైనర్ డ్రైవింగ్, అతి వేగంగా వెళ్లటం వంటివి అన్నీ ట్రాఫిక్ నియమాల ఉల్లంఘన కిందకే వస్తాయని ఆయన వివరించారు. యువత వాహనాలను ప్రమాదకరంగా, వేగంగా నడుపుతున్నారని, స్పీడ్ థ్రిల్ నిస్తుందని, కాని అది కిల్ కూడా చేస్తుందన్నారు. వేగంకన్నా, ప్రాణం మిన్నా అని, ఎంత సురక్షితంగా చేరుకున్నామన్నదే ముఖ్యమని ఆయన తెలిపారు.ఈ సందర్భంగా ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించి రోడ్డు ప్రమాదాల బారిన పడి మృతిచెందిన వారి వీడియోలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా చూపించి అవగాహన కల్పించారు. ట్రాఫిక్ ఎస్ఐలు రాము, మహ్మద్ జానీ, ఏఎస్ఐలు శివ నారాయణ, సుధాకర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్‌కు డ్యూటీ విరమణ సందర్భంగా టీచర్‌కు రూ.2 లక్షలు, ఆయాకు రూ.లక్ష రూపాయలు చెల్లించాలని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా నాయకులు ఏర్పుల నరసింహ డిమాండ్ చేశారు. మంగళవారం హయత్‌నగర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో హయత్‌నగర్ ప్రాజెక్ట్ అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో రిటైరవుతున్న టీచర్లు అమృతమ్మ, జానకమ్మ, అరుణ, పాపమ్మ పాల్గొన్నారు.

–హయత్‌నగర్, జూలై 2

వందేళ్ల చెట్టు నరికివేత

వనస్థలిపురం, జూలై 2 : వందేళ్ల చరిత్ర కలిగిన మహా వృక్షం... రావి చెట్టు వేపచెట్టుతో పెనవేసుకుని పరమశివుడి సన్నిధిలో ప్రజలకు నీడను, ఆహ్లాదాన్ని పంచుతుంది. 4 తరాలు ఆ చెట్టు కింద సేదతీరాయి. ఉన్నట్టుగా ఆలయ కమిటీ ఏమనుకుందో ఆ వృక్షాన్ని నేల కూల్చారు. దీంతో పర్యావరణ కార్యకర్తలు, స్థానికులు ఆందోళనకు దిగారు. వనస్థలిపురం ఫేజ్1 కాలనీలోని శివాలయంలో ఈ సంఘటన జరిగింది. అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని వారు వాపో తున్నారు.

దేవుడి సన్నిధిలో ఉన్న శతాబ్ధి చరిత్ర కలిగిన వృక్షాలను నరకడం సరికాదని సామాజిక కార్యకర్త, స్థానికురాలు ఆశాజ్యోతి ఆగ్రహం వ్యక్తం చేశారు. చెట్టును నరకడంపై ప్రముఖ పర్యావరణ కార్యకర్త జ్ఞానేశ్వర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. చెట్టుపై కూర్చుని నిరసన వ్యక్తం చేశారు.

మరిన్ని సేవలందిస్తా..

అంజయ్యకు నియామకపత్రం అందజేస్తున్న మహేంద్రకుమార్‌రెడ్డి

కందుకూరు, జులై 2 : కందుకూరు లైయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు తాళ్ల అంజయ్య జిల్లా 320 అడిషనల్ కార్యదర్శిగా నియమితులయ్యారు ఆయన పదోన్నతి పొందడంతో లయన్స్‌క్లబ్ సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నియామకపత్రాన్ని గవర్నర్ డాక్టరు పీ మహేంద్రకుమార్‌రెడ్డి కందుకూరులో అందజేశారు. లయన్స్ క్లబ్ బలోపేతం కోసం కృషి చేయాలని కోరారు. జిల్లా స్థాయిలో రాణించడంపై లయన్స్ క్లబ్‌కు మరిన్ని సేవలను అందిస్తానని ఆయన తెలిపారు. క్లబ్‌కు వన్నె తీసుకురావాలని మహేంద్రకుమార్ కోరారు.

మూసీ పరీవాహక ప్రాంతంలో సర్వే

కొత్తపేట జనప్రియ అవెన్యూ వద్ద కాలనీవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

ఎల్బీనగర్, జూలై 2: మూసీ నదికి 50 మీటర్లలోపు ఉన్న భవనాలను ఉప్పల్ మండల రెవెన్యూ అధికారులు,సిబ్బంది మంగళవారం సర్వే చేసి గుర్తిస్తున్నారు. నాగోలు బ్రిడ్జి మొదలుకుని మారుతీనగర్ వరకు ఉప్పల్ మండల రెవెన్యూ అధికారులు సర్వేను నిర్వహించారు. మూసీ నది అభివృద్ధి నిమిత్తం నదికి ఆనుకుని ఉన్న ప్రాంతాన్ని డిప్యూటీ తహసీల్దార్ వరలక్ష్మి, హెచ్ఎండీఏ అధికారులతో కలిసి సర్వే చేస్తున్నారు. మూసీ నదిని అభివృద్ధి చేసే క్రమంలో భాగంగా ఉన్నతాధికారుల ఆదేశాలతో భవనాలు, నిర్మాణాలను గుర్తిస్తున్నామని తెలిపారు. ఈ మేరకు మారుతీనగర్‌లో జనప్రియ ఎవెన్యూ ప్రాంతంలో అధికారులు సర్వే చేస్తున్న నేపథ్యంలో కాలనీవాసులు ఇచ్చిన సమాచారం మేరకు కార్పొరేటర్ పవన్‌కుమార్ ఆ ప్రాంతానికి చేరుకుని సర్వే ఎందుకు చేస్తున్నారంటూ అధికారులను ప్రశ్నించి తెలుసుకున్నారు. అధికారులు తాము కేవలం సర్వే మాత్రమే చేస్తున్నామని అంతే తప్ప ఎలాంటి ఇబ్బందులు లేవని తెలిపారు.

హయత్‌నగర్‌లో జోనల్ కమిషనర్ పర్యటన

బాతుల చెరువును పరిశీలిస్తున్న జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్

హయత్‌నగర్, జూలై 2: హయత్‌నగర్ సర్కిల్ పరిధిలోని హయత్‌నగర్, నాగోల్, మన్సూరాబాద్ డివిజన్లలో ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ స్థానిక కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లతో కలిసి పర్యటించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. హయత్‌నగర్ డివిజన్‌లో కుమ్మరికుంట చెరువు, బాతుల చెరువులను సందర్శించి అక్కడ బేబీ పాండ్ నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేసి పంపించాలని అధికారులను ఆదేశించారు. వెంకటేశ్వర కాలనీ, గాయత్రీనగర్, బ్యాంక్ కాలనీల్లో ఇంటర్నల్ రోడ్లు ప్రతిపాదనలను పరిశీలించారు. మన్సూరాబాద్ డివిజన్‌లో బిగ్ బజార్, మన్సూరాబాద్ చౌరస్తా మీదుగా సుష్మా రోడ్డు వరకు చేపట్టాల్సిన రోడ్డు విస్తరణ పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మన్సూరాబాద్ పెద్ద చెరువు ప్రాంతాన్ని పరిశీలించి చెరువులోకి డ్రైనేజీ మురుగునీరు రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. హయత్‌నగర్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ తిప్పర్తి యాదయ్య, కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి, నాగోల్ కార్పొరేటర్ చింతల అరుణ, మన్సూరాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి, డిప్యూటీ డైరెక్టర్ వెటర్నరీ డాక్టర్ రంజిత్, ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్ రమేశ్ బాబు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ పావని, ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్ దామోదర్, ఎలక్ట్రికల్ ఇంజినీర్ జగన్నాథం, అసిస్టెంటు ఇంజినీర్లు రాకేశ్, నరేంద్ర తేజ, చంద్రశేఖర్‌రెడ్డి, ఎంటమాలజీ ఏఈ రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

అసంపూర్తి పనులు పూర్తి చేస్తాం

సమస్యలను పరిశీలిస్తున్న ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్‌పాటిల్

మన్సూరాబాద్, జూలై 2: ఎల్బీనగర్ నియోజకవర్గంలోని పలు డివిజన్ల పరిధిలో అసంపూర్తిగా మిగిలి పోయిన అభివృద్ధి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయించేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్‌పాటిల్ తెలిపారు. ఎల్బీనగర్ నియోజకవర్గం పరిధి నాగోల్ డివిజన్‌లోని నాగోల్ నుంచి తాజ్ హోటల్ వరకు ప్రతిపాధించిన సీసీరోడ్లు, బీటీ రోడ్లు, నాగోల్ చెరువు సుందరీకరణ, వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, ఆనంద్‌నగర్ చౌరస్తా ఆధునీకరణ పనులను పరిశీలించారు. హెచ్ఎంసీ హయత్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమీషనర్ తిప్పర్తి యాదయ్య, మన్సూరాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ, డిప్యూటీ డైరెక్టర్ వెటర్నరీ డాక్టర్ రంజిత్, ఈఈ రమేష్‌బాబు, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ పావని, ఎలక్ట్రికల్ ఈఈ పున్నా నాయక్, డీఈ దామోదర్, ఎలక్ట్రికల్ ఇంజనీర్ జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలి

ఎల్బీనగర్, జూలై 2: ఎల్బీనగర్ నియోజకవర్గంలోని కొత్తపేట డివిజన్‌లో అభివృద్ధి పనులకు అధిక నిధులను మంజూరు చేయాలని కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్ ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. మంగళవారం జోనల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్‌ను కలిసిన కార్పొరేటర్ పవన్‌కుమార్ మాట్లాడుతూ కొత్తపట డివిజన్‌లోని గాయత్రిపురం నుంచి మూసీ వరకు నిర్మించిన బాక్స్ డ్రైయిన్ పనులు మధ్యలో ఆగిపోవడంతో ఇబ్బందిగా మారిందని తెలిపారు. సుమారు 9 కాలనీలకు ప్రధాన రహదారి అయిన ఈ రోడ్డులో పనులను త్వరితగతిన పూర్తి చేసి మేలు చేయాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి కృషి

కార్పొరేటర్ అరుణకు వినతి పత్రం అందజేస్తున్న ప్రతినిధులు

సైదాబాద్, జులై 2 : ఎల్‌సీహెచ్ కాలనీలో సమస్యలను పరిష్కరించటానికి తగిన చర్యలు తీసుకుంటానని సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్ రెడ్డి అన్నారు. మంగళవారం ఎల్‌సీహెచ్‌కాలనీ పార్క్‌ను సందర్శించిన సందర్భంగా కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు ఆమెకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు బ్రహ్మం, సలహాదారుడు చెప్పల వెంకటేశం, ప్రధాన కార్యదర్శి సూర్యం, ఉపాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, స్పోర్ట్స్ సెక్రటరీ ముజ్జు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పెట్టుబడి సాయం అందజేయాలి

కందుకూరులో మాట్లాడుతున్న చంద్రశేఖర్

కందుకూరు, జులై 2 : రైతులకు తక్షణమే ప్రభుత్వం రైతు పెట్టుడి సాయం అందజేయాలని పీఏసీఎస్ చైర్మన్ దేవరశెట్టి చంద్రశేఖర్ కోరారు. మంగళవారం కార్యాలయం ఆవరణలో రైతులతో రైతు భరోసా అభిప్రాయ సేకరణ కోసం ప్రత్యేక సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. రైతుల తెలిపిన అభిప్రాయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని చైర్మన్ చంద్రశేఖర్ తెలిపారు. వ్యవసాయ శాఖ ఏడీఏ సుజాత, వైఎస్ చైర్మన్ గోపీరెడ్డి విజేందర్‌రెడ్డి, ఎంపీపీ మంద జ్యోతి పాండు, వైఎస్ ఎంపీపీ గంగుల శమంత ప్రభాకర్ రెడ్డి,బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గంగాపురం లక్ష్మీనర్సింహారెడ్డి, డైరెక్టర్లు సురుసాని శేఖర్‌రెడ్డి, నర్సింహ,యశోధ, వెంకటేశ్, పర్వతాలలు, సత్తినేని వెంకట్‌రాంరెడ్డి,ఎంపీటీసీలు రాములు, మల్లేశ్,అంజమ్మ, వ్యవసాయ అధికారి లావణ్య పాల్గొన్నారు.

శివారు కాలనీల అభివృద్ధికి ప్రత్యేక కృషి

ఆఫీసర్స్ కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి

వనస్థలిపురం, జూలై 2 : శివారు కాలనీల్లో అభివృద్ధికి కృషి చేస్తున్నామని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. మంగళవారం ఆఫీసర్స్ కాలనీలో జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. కాలనీలో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.15లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. బుధవారం పనులు ప్రారంభమవుతాయన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డీఈ దామోదర్, జలమండలి డీజీఎం రాజగోపాల్, ఏఈ నరేందర్ రెడ్డి, మహేశ్ గుప్తా, పవిత్ర, రఘుపతిరెడ్డి, రాజశేఖర్, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీపీఈడీ, డీపీఈడీ పరీక్షా ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 2: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీపీఈడీ, డీపీఈడీ కోర్సుల పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సుల రెండు, నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్ పరీక్షా ఫీజును ఈ నెల 9లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ.200 అపరాధ రుసుముతో 10 వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నట్లు తెలిపారు.